“గీసారి మీ అవిడ్నిగా సెంటర్లా లింగు లిటుకు ఫోటో స్టుడియ వున్నది. గాడ ఫోటో తీయించు. జబర్థస్తతీస్తడు సాలెగాడు”.

“అలాగే....ముందు మీరు అవిడ్ని వెతికి పట్టి తెస్తే తర్వాత జబర్దస్తీగా ఫోటోలు తీయిస్తాలే” అన్నాడు బుచ్చిబాబు విసుగ్గా.

ఇనస్పెక్టర్ యాధ్గిరి నాలుక కర్చుకున్నాడు.

“హ[రే! గా సంగతి యాద్ మర్సిన. సరే జర కూర్చుని కంప్లయింట్ గిట్టు రాసియ్”

బుచ్చిబాబు ఇనస్పెక్టర్ యాధ్గిరి ముందుకూర్చుని కంప్లయింట్ రాయడం మొదలుపెట్టాడు.

0 0 0

“అయ్యా మీ కోసం ఎవరో వచ్చారండయ్యా” పనివాడు మినిస్టర్ మిన్నారావ్‌తో చేప్పాడు.

“అలాగా?” అంటూ మినిస్టర్ మిన్నారావ్ వరండాలోకి వెళ్ళాడు.

అక్కడ ఒక వ్య క్తి నిలబడి వున్నాడు. అతని మొహంలో నిర్లక్ష్యం.

“ఏంటి ఏం కావాలి?” అడిగాడు మినిస్టర్ మిన్నారావ్ ఆ వ్య క్తిని ఉద్దేశించి.

“నేను ఈ వెనుక లైన్‌లో వుంటానండీ. నాపేరు పాపారావు” చెప్పాడు అ వ్య క్తి.

“సరే.... అసలు నాతో పనేటి? ఏదయినా ఓపెనింగ్స్ సెయ్యాలా?” అడిగాడు మిన్నారావు.

“ఓపెనింగ్స్ ఏమీ లేవు గానీ ఈ వేళ మాఇంట్లో పనిమనిషిరాలేదు. తోమాల్సినవి బోలెడన్ని అంట్లు ఉన్నాయి. మాసిన బట్టలు కూడా చాలా వున్నాయి” అన్నాడు పాపారావు.
“మరి?”

“ఓ సారి మీరే మా ఇంటికొచ్చి ఆ అంట్లన్నీ తోమేసి, ఆ బట్టలన్నీ ఉతికేసి ఇల్లు కాస్త చిమ్మేసి వెళ్ళాలి” కూల్‌గా చెప్పాడు పాపారావు.

అది వింటూనే మినిస్టర్ మిన్నారావ్ తోక తొక్కిన త్రాచులా ఇంతెత్తున లేచాడు.

“ఏంటీ? నేను మీ ఇంటికొచ్చి ఆ అంట్లు తోమాలా? బట్టాలుతకాలా? నీకు నేనెలా కన్పిస్తున్నానేంటి? నీ బుర్రేమైనా తిరుగుతుందా? నీకేటైనా మెంటలా?”

పాపారావు ఏం మాట్లాడకుండా సైలెంట్‌గా చంకలో మడిచిపెట్టి వున్న పేపర్ తీసి మినిస్టర్ మిన్నారావుకి ఇచ్చాడు.

“దాన్ని చూడండి”

మినిస్టర్ మిన్నారావ్ ఆ కాగితాన్ని మడత విప్పి చూసి భయంతో గజగజా వణికాడు.

అది రాజేంద్ర హత్యకి సంబంధించి పడిన వార్తకి జిరాక్స్ కాపీ.

"ఆ" జుట్టు పీక్కుంటూ బాధగా అరిచాడు మిన్నరావ్.

"కుదర్దు....వీల్లేదు" అన్నాడు.

"వీల్లేదంటే ఎలా? నేను ఈ జిరాక్స్ కాపీని వెయ్యి రూపాయలు పెట్టి కొన్నాను" అన్నాడు పాపారావు సీరియస్‌గా.

"అయితే ఏటి? ఏదో ప్రమోషనో, ట్రాన్స్‌ఫరో అయితే సాయం సెయ్యచ్చుగానీ మరీ అంట్లు ఎట్లా తోముతా అసలు నీకి కాయితం ఎవరిచ్చారు?" కుమిలిపోతూ అడిగాడు మిన్నారావ్.

"ఎవరో రహస్యంగా అమ్మారు! ఇదిమీకు చూపిస్తే ఏ పనయినా చేస్తారని చెప్పి వెయ్యి రూపాయ గుంజారు"

"ఈ కాయితాన్ని ఎక్కడ అమ్ముతున్నారు?"

"ఇక్కడా అక్కడ అని కాదు ఒక్కోరోజు ఒక్కోచోట రహస్యంగా అమ్ముతుంటారుట, సరే...అంట్లు తోమాలి పదండి"అన్నాడు పాపారావు.

"కుదర్దు....వీల్లేదు" అరిచాడు మిన్నారావు.

"నీకు అమ్మినవాడి మొహం మీద ఈ కాయితం కొట్టి నీ వెయ్యి రూపాయలు నువ్వు తీస్కో"

"అదెలా కుదుర్తుంది" అంటూ ఏదో అనబోయాడు.

"గుర్కా" అంటూ కేక పెట్టాడు మిన్నారావు.

"పొద్దుటే భలే కేసు దొరికింది వెయ్యి రూపాయలు లాసు" గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు పాపారావు.

పాపారావు వెళ్ళిన తర్వాత మా డ్రైవర్ రాలేదు, కారు తోలడానికి రమ్మని ఒక వ్యక్తి, మా వంట మనిషి రాలేదు వంట చెయ్యడానికి రమ్మని మరో వ్యక్తి మినిస్టర్ మిన్నారావ్ దగ్గరకి వచ్చారు.

ఇద్దరి దగ్గరా రాజేంద్ర హత్యకి సంబంధించిన జిరాక్స్ కాపీలు ఉన్నాయి.

వాళ్ళిద్దర్నీ అరిచి పంపించేసాడు మినిస్టర్ మిన్నారావు. పరిస్థితి పూర్తిగా విషమించందని మినిస్టర్ మిన్నారావుకి అర్ధం అయింది. దీన్ని అదుపు చేయాలంటే ఒక్కటే మార్గం.

బుచ్చిబాబుని పైకి పంపించడమే! ఆ పని సమర్ధవంతంగా చెయ్య గలవాడు ఒక్కడే!

మినిస్టర్ మిన్నారావ్ ఫోన్ దగ్గర కెళ్ళి ఓ నెంబర్ డయల్ చేశాడు.

నాలుగు క్షణాలు అగి అవతలి వ్యక్తి ఫోన్ ఎత్తాక అడిగాడు.

"హలో! ఓరు మాట్లాడేది? రుస్తుం దాదామేనా?"

0 0 0

రాత్రంతా నిద్రలేక బుచ్చిబాబు ఉదయం త్వరగ లేవలేక పోయాడు. అతను స్నానం చేసి భోజనం చేసి ఇంట్లోంచి బయటపడి తిన్నగా పోలీస్‌స్టేషన్ కెళ్లాడు సీత గురించి కనుక్కుందామని.

"హర్రె ఇస్కీ... అర్థరాత్రి ఫోటో ఇచ్చినవ్ పొద్దాల పొద్దాలనే దొరుకుతార్ వయ్యా?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ యాద్గిరి బుచ్చిబాబుతో.

మరోసారి యస్టీడీ బూత్ నుండి రాధకి ఫోన్ చేశాడు సీతేమైనా అక్కడికి వెళ్ళిందేమోనని. సీత అక్కడికి రాలేదని రాధ చెప్పింది.

బుచ్చిబాబు మనసు చాలా అల్లకల్లోలమైపోయింది. సీతకేమయినా కీడు జరిగిందేమోనని అతనికి చాలా అందోళనగా వుంది.

బుచ్చిబాబు ఆఫీసుకి అరగంట ఆలస్యంగా వెళ్లాడు.

బుచ్చిబాబుని చూస్తూనే మోహన్ తల తిప్పేసుకున్నాడు. మోహన్ అల ఎందుకు ప్రవర్తిస్తున్నాడో బుచ్చిబాబుకి అర్థం కాలేదు.

బుచ్చిబాబు సీట్లో కూర్చోగానే ఏకాంబరం పిలుస్తున్నట్టు ప్యూన్ వచ్చి చెప్పాడు. ఆలస్యంగా అఫీసుకు వచ్చినందుకు చీవాట్లు తినక తప్పదని అనుకుంటూ బుచ్చిబాబు ఏకాంబరం క్యాబిన్‌లోకి వెళ్ళాడు.

అతను ఊహించని విధంగా ఏకాంబరం కులాసాగా నవ్వుతూ "రా... రావోయ్... రా...ఏంటి ఆఫీసుకింత ఆలస్యంగా వచ్చావ్?" అన్నాడు ఏకాంబరం .

"అంటే....అదీ...మరేమో..." ఏదో చెప్పబోయాడు బుచ్చిబాబు .

"సర్లె....సర్లె... నువ్వేం చెప్పనక్కర్లేదులే. ఈ టైంలో ఏం ఎక్స్‌ప్లనేషనిచ్చినా అది అబద్ధమే అవుతుంది. ఏముందీ.. ఒంట్లో బాలేదనో, స్కూటర్ టైర్ పంక్చర్ అయ్యిందనో లేదా సిటీ బస్సు దొరకలేదనో, ఇలానేగా వుంటాయ్ ఎక్స్‌ప్లనేషన్స్ అన్నీ..నీకంటే సీతె నయమోయ్... ముందొచ్చేసింది."

బుచ్చిబాబు ఉలిక్కిపడ్డాడు.

సీతంటాడేమిటి? అతను అన్న సీతా, నా సీతా ఒకరు కాదుకదా ఛఛ.... ఒక్కరు ఎలా అవుతారు. ఏకాంబరానికి నా సీత గురించి తెలీదు ఒకవేళ తెలిసినా సీత ఇక్కడికి ఎందుకొస్తుంది? మరి నా సీత గురించి కాకపోతే వేరే సీత గురించి ఎందుకు చెప్తాడు? అనుకున్నాడు.

"సీతా? సీతెవరు సార్?" అయోమయంగా అడిగాడు బుచ్చిబాబు .

ఆ ప్రశ్న వింటూనే ఏకాంబరం పగలబడి నవ్వాడు.

"హబ్బ....హబ్బ! ఏం నవ్విస్తావయ్యా బాబూ? నేనేమైనా అమాయకపక్షిననుకున్నావా?

ఏమో అనుకున్నాగానీ నువ్వు కిల్లారి కిత్తిగాడి వేనోయ్. సీతెవవరని అడుగుతున్నావా? నాకంతా తెల్సులేవోయ్... నా దగ్గరికి ఉద్యోగానికి పంపించి మళ్ళీ ఆడుగుతున్నావా?"

బుచ్చిబాబు మైండంతా గందరగోళం అయిపోయింది. ఇంకా స్పేపయితే అతనికి పిచ్చెక్కెలా వుంది.

"అంటే మీరడిగేది ఏ సీత గురించా అనీ" నసగాడు బుచ్చిబాబు.

"అదేనయ్యా రామాయణంలో శ్రీరామచంద్రుడు లేదూ ఆయనగారి భార్య గురించి! అబ్బో...నువ్వు కిల్లారికిత్తేకాదు పెద్ద ఢస్కుఢమాల్ గాడివే!"

ఏకాంబరం ఇలా అంటుండగానే సీత అతని క్యాబిన్‌లోకి వచ్చి అతని ముందు ఓ ఫైల్ పెట్టింది.

సీతని చూడగానే బుచ్చిబాబుకి ఆనందం, ఆశ్చర్యం ఏదో తెలీని భయం, సందేహం, ...... ఇలా అన్ని భావలూ కలగాపులగంగా కలిగి ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

"నేను చెప్పింది ఈ సీత గురించే" అన్నాడు ఏకాంబరం .

0 0 0

లంచ్ టైం...............

"చెప్పు....చెప్పు..... చెప్పు ....... చెప్పు...." టేబుల్ మీద నాలుగు సార్లు గుద్దాడు. బుచ్చిబాబు .

సీత బుచ్చిబాబుల మధ్య టిఫిన్ బాక్స్ నాలుగుసార్లు ఎగిరింది.

"ఏం చెప్పాలి?" బాక్స్ మూత తెరుస్తూ అరిచింది సీత .

"ఓ చపాతీలు! మీ అమ్మగారు చేసారా? నువ్వా?"

బుచ్చిబాబు చటుక్కున టిఫిన్ బాక్స్ మూత లాక్కుని మూత పెట్టేసాడు.

"చపాతీలు సంగతి తరువాత? ముందీ సంగతి చెప్పు. రాత్రి ఎక్కడెక్కడ తిరిగావ్! నేను టెన్షన్‌తో చస్తుంటే నువ్వు కులాసాగా తిరిగి ఇక్కడ ఆఫీసులో ప్రత్యక్షమవుతావా? చెప్పు.....ఎక్కడికెళ్ళావ్?" కోపంగా అడిగాడు బుచ్చిబాబు .

"రాత్రి ఏమైందో, నేనెక్కడికి వెళ్ళానో చెప్తే నువ్వు గుండెలు పగిలేలా ఏడుస్తావ్?" సీత మరింత కోపంగా బుచ్చిబాబు వంక చూస్తూ అంది.

ఆ దెబ్బకి బుచ్చిబాబు గ్యాస్ తీసిన బెలూన్‌లో అయిపోయాడు!

"సరే....... సరే అందుకే కదా టెన్షన్ ఫీలయిపోతూ చెప్పమన్నాను" మెల్లగా అన్నాడు బుచ్చిబాబు .

"ఇక్కడకాదు ఆఫీసు నుండి బయటపడ్డాక చెప్తాను"

"అంతదాకా నేను సస్పెన్స్ భరించలేను"

"భరించి తీరాలి"

బుచ్చిబాబు నిట్టూర్చాడు.

"పోనీ ఇక్కడ ఉద్యోగంలో ఎలా చేరావ్?" అడిగాడు.

"అది కూడా సాయంత్రమే చెప్తా"

"ఈ మాటలు వినడానికా ఉదయం నుండీ లంచ్ టైం కోసం ఎదురు చూసాను. అయినా నువ్వు లంచ్‌కి ఇంత ఆలస్యంగా వచ్చావేం?" అడిగాడు బుచ్చిబాబు టిఫిన్ బాక్స్ మూత తెరుస్తూ.

"కనీసం ఆలస్యంగానైనా వచ్చాను. అందుకు సంతోషించు. రేపట్నుండీ లంచ్ టైంలో కూడా రావడానికి కుదుర్తుందో లేదో"

"ఏం!" బుచ్చిబాబు కనుబొమలు ముడిపడ్డాయి.

"మీ ముసలాడు నన్నస్సలు వదలడంలేదు. నిముషానికోసారి క్యాబిన్‌లోకి పిలుస్తున్నాడు. ఏదో ఒక ఫైలిస్తాడు దాని గురించి పావుగంట చెప్తాడు. సరే దాన్ని అటెండ్ అవుదామని సీట్లో కూర్చుంటే మళ్లీ నిముషం తరువాత క్యాబిన్‌లోకి పిలిచి ఇచ్చిన ఫైలు తీసేస్కుని వేరే ఫైలు పావుగంట ఎక్స్‌ప్లెయిన్ చేస్తాడు. నిముషం తరువాత దాన్ని తీసేస్కుంటాడు. ఫైళ్ళు ఇస్తాడు. తీస్కుంటాడు. మళ్ళీ ఇస్తాడు తీస్కుంటాడు".

"ఎందుకలా?" అనుమానంగా చూస్తూ అడిగాడు బుచ్చిబాబు .

"ఎందుకంటే నేనంటే చచ్చేంత క్రేజ్" నవ్వుతూ అంది సీత.

"అదే.....ఎందుకనీ అలాగా?" పళ్ళు నూర్తూ అన్నాడు.

"మళ్ళీ ఎందుకని ఆడుగుతావేం? నేనంటే క్రేజ్ ఉండదూ మరి? నీతో పెళ్ళి కాకుండా కాపురం చేస్తున్నట్టు వాడికి తెలిసింది అందుకని ఓ చూపు చూద్దామని వాడికీ అనిపించిందేమో?"

బుచ్చిబాబు కోపంగా టిఫిన్ బాక్స్ నేలకేసి కొట్టాడు.

* * *

అదే రోజు సాయంత్రం.......

పార్కులో........

బుచ్చిబాబు కోపంగా పళ్ళు నూరాడు. కుడిచేయి పిడికిలి బిగించి ఎడమచేయి అరచేతిలో కసిగా గుద్దుకున్నాడు.

"హు! అయితే ఆ మోహన్ గాడు అలాచేశాడన్నమాట! యెంత ధైర్యము ? వాడి

అంతు చూస్తాను" అవేశంగా అన్నాడు బుచ్చిబాబు .

"ఏం చేస్తావ్?" అడిగింది సీత .

"నిలదీసి అడుగుతా, ఆ తరువాత చెంపలు వాయిస్తా"

"అలాగేం? అస్సలు నువ్వెవరు.... సీత కీ నీకూ ఏంటి సంబంధం?" అని అడుగుతాడు.

"సీత నా మనిషి అని అంటాను"

"నీ మనిషంటే? సీతకి నువ్వేమైనా తాళి కట్టావా? అని అడుగుతాడు."

"ఓ..... డామ్ విత్  తాళి" జుట్టు పీక్కుంటూ బాధగా అన్నాడు బుచ్చిబాబు .

"వాడి సంగతి నువ్వేం చూడక్కర్లేదు. నీ కంటే ఎక్కువ కసి నాకుంది. వాడి సంగతి నేను చూస్తాగా?"

"ఎలా?"

"చెప్పను.....చేసి చూపిస్తాను"

ఆమె కళ్ళలో కసి కనిపించింది బుచ్చిబాబుకి

"సరే....ఆ వెధవ నిన్ను బలవంతం చెయ్యబోతే నువ్వు బయటకి పారిపోయి వచ్చేసావ్. మరి రాత్రంత ఎక్కడున్నావ్?" అడిగాడు బుచ్చిబాబు .

"అదే చెప్పబోతే నువ్వు వాడి అంతుచూస్తా....చీరేస్తా అంటూ చిందులు వేసావ్. నేను వాడి ఇంటిలోంచి బయటకి వచ్చి రోడ్డుమీద దిక్కుతోచకుండా పరుగుతీస్తుంటే నా ప్రక్కన నవీన్ స్కూటర్ ఆపాడు నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళాడు"

"ఏంటి? రాత్రంతా నువ్వు నవీన్ ఇంటిలో ఉన్నావా?" మొహంలో రంగులు మారుతుండగా బుచ్చిబాబు అడిగాడు.

"లేకపోతే రోడ్డు ప్రక్కన ఫుట్‌పాత్‌మీద పడుకోమంటావా?" సీరియస్‌గా అంది సీత .

"అదికాదు..... నవీన్ ఒంటరిగా వుంటాడేమో?"

"పెద్ద ప్రియమిత్రుడు చక్కగా పెళ్ళాంతో వుంటూ చాలా మంచి ఘనకార్యం చేసాడులే పాపం! నవీన్ జరిగిందంతా విని చాలా బాధపడ్డాడు. ఎంతో డిగ్నిఫైడ్ పర్సన్, చాలా మంచివాడు"

"సర్లే.....సర్లే ఆ మాత్రం సహాయం ఎవరైనా చేస్తారు!" మొహం ముడుచుకుంటూ అన్నాడు బుచ్చిబాబు .

"జెలసీనా? నేను సేఫ్‌గా వున్నందుకు ఆనందించు, రాత్రిపూట వంటరిగా నేను రోడ్డు మీద వస్తుంటే ఎవరైనా ఏమైనాచేస్తే ఏంటి దిక్కు? అతనే సమయానికి రాకపోతే నేను నీ దగ్గరికి రావాల్సి వచ్చేది! అప్పుడు గందరగోళమైపోయి వుండేది."

"మరి నీకు చీరలు?"